# పెద్దలను గౌరవించాలనే సంస్కారాన్ని చిన్నతనం నుంచే అలవాటు చేయాలి

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి







వరంగల్ బ్యూరో, అక్టోబర్ 1,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి వృద్ధప్యం కలిగిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఈ అవసానదశ తప్పని సరిగా వస్తుందని, పెద్దలను గౌరవించడం అనే సంస్కారాన్ని పిల్లల తల్లిదండ్రులు పిల్లలకు చిన్న తనం నుంచే అలవాటు చేయాలని గుర్తు చేశారు. సీనియర్ సిటిజన్స్ ను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో అన్ని అనుభవాలను చవిచూసిన వృద్ధుల ఆలోచనలు అమూల్యమైనవని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లుగా బాధ్యతలు నిర్వర్తించిన ఆలోచనలు, జీవిత అనుభవాలు ఈ తరం పిల్లలకు అవసరమని పేర్కొన్నారు. ఉత్సాహం అంతులైన వారు ఎవరైనా ఉన్నట్లైతే ప్రభుత్వ పాఠశాలల పిల్లలకి మీయొక్క ఆలోచనలు, సలహాలు ఎంతగానో అవసరం పడతాయన్నారు. ఇందుకు అవకాశం కల్పించే విధంగా దిశ నిర్దేశం చేయుటకు విద్య శాఖ అధికారికి ఆదేశాలు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**అదనపు కలెక్టర్ జి.సంధ్యా రాణి మాట్లాడుతూ**

ప్రతి ఒక్కరికి గౌరవంగా జీవించే హక్కు ఉందని, ప్రస్తుత పరిస్థితుల దృశ్య ప్రజావాణిలో వృద్దులకు సంబందించిన దరఖాస్తులు దాదాపుగా వస్తున్నాయని అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి అన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులపై నిర్లక్ష్యం చేసినట్లయితే అందుకు చట్టాలు ఉన్నాయని, అవసానదశలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అందుకు ట్రిబ్యునల్ అధికారిగా జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి వ్యవహారిస్తారని అన్నారు. ఈ చట్టాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు.

**వరంగల్ ఆర్డీవో మాట్లాడుతూ**

సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి చట్టం ఉందని వరంగల్ జిల్లా ఆర్డీవో తెలిపారు. ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందుకు ఆర్డీవోకి పూర్తి నిర్ణయం తీసుకునే అధికారం కలదని చెప్పారు. ఈ మధ్యన చాలా దరఖాస్తులు వచ్చాయని, వాటిని జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని న్యాయం జరిగేలా చేయడం జరిగిందని వివరించారు. ఇకముందు వృద్ధుల సమస్యలపైన వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్, పోలీసు యంత్రాంగం, న్యాయ నిపుణులచే సమస్యలు త్వరగా పారిష్కరించుటకు కృషి చేస్తానని అన్నారు.

**డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సురేష్ మాట్లాడుతూ**

తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం గురించి డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ పర్సన్ సురేష్ అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్స్ కి ఎలాంటి సహాయం కావాలన్నా తక్షణమే స్పందించి, పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లలకు ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసే ముందు, లీగల్ గా కలిసి చేయాలన్నారు. ఒకవేల పిల్లలకు ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే గిఫ్ట్ డీడ్ మాత్రమే చేయాలని, సేల్ డీడ్ చేయవద్దని సూచించారు.



**జిల్లా వైద్య అధికారి వెంకటరమణ మాట్లాడుతూ**

సీనియర్ సిటిజన్స్ ఆరోగ్యం పట్ల జిల్లా వైద్యాధికారి వెంకటరమణ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోజు మెడిటేషన్ తో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. జిల్లాలో అప్పుడప్పుడు సీనియర్ సిటిజన్స్ కోసం హెల్త్ క్యాంప్స్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

**బ్రహ్మకుమారీస్ కల్పన సిస్టర్స్ మాట్లాడుతూ**

వయోవృద్ధులు వయస్సుతో సంబంధం లేకుండా అన్ని పనులు చేసుకోవాలని బ్రహ్మకుమారిస్ కల్పన సిస్టర్స్ సూచించారు. శారీరకంగా, మానసికంగా కుమిలిపోకుండా, ఉల్లాసంగా ఉండాలన్నారు. ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండటం వల్ల చాలా ఉత్సాహంగా ఉంటామన్నారు. అందరూ అలాగే నవ్వుతు ఉండాలని తెలిపారు.

**జిల్లా సంక్షేమ శాఖ అధికారి జె. హైమావతి మాట్లాడుతూ**

60 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్స్ కి సీనియర్ సిటిజెన్ కార్డ్స్ ఇవ్వబడుతున్నాయని జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి తెలిపారు. పిల్లలు సరిగ్గా చూసుకోని తల్లి తండ్రులు, వారి సమస్యలను తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. వారికి సఖి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ చేసి, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వయోవృద్ధులను ఇబ్బందులకు గురి చేసినా, తిట్టినా, కొట్టిన వారికి చట్ట పరమైన చర్యలు వుంటాయని తెలిపారు. నిరాశ్రయులు అయిన వారిని రెస్క్యూ చేసి, ప్రాథమిక చికిత్స కల్పించి, ఓల్డ్ ఏజ్ హోమ్స్ లో పెట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా వయోవృద్ధుల కమిటీ మెంబెర్స్, 102 సంవత్సరాల వయోవృద్ధుడు మాధవ రావుని (కర్రసాము చేస్తాడు )కలెక్టర్ సత్కరించారు. వారోత్సవాలలో భాగంగా ఓల్డ్ ఏజ్ హోమ్స్ లో పలు క్రీడాలలో గెలుపొందిన వయోవృద్ధులకు బహుమతులు అందించారు. చివరిగా వయోవృద్ధులతో ప్రతిజ్ఞ చేయించి, హాజరైన వయోవృద్దులకు భోజన పాకెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జ్ఞానేశ్వర్, డి ఆర్డిఏ ఏఓ పరమాత్మ, సిడిపిఓలు విద్యా, దెబోరా, మధురిమ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ అరుణదేవి, హేమలత, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ అనిరుద్ యాదవ్, సఖి సిఎ శ్రీలత, డిహెచ్ఈడబ్ల్యూ కోర్డినేటర్ పావని, హర్షిత, సుజాత, జిల్లా వయోవృద్ధుల కమిటీ మెంబెర్స్ మల్లారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, రవీందర్, చంద్రశేఖర్, జిల్లాలోని పలు సీనియర్ సిటిజెన్ అసోసియేషన్స్, ఓల్డ్ ఏజ్ హోమ్స్ నిర్వాహకులు, వయోవృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు






మహబూబాబాద్, అక్టోబర్ 1,(జర్నలిస్ట్ వార్త): అనుబంధాలను కలుపుతూ సాంప్రదాయాలను నేర్పించే పండుగ బతుకమ్మని మహబూబాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపల్ కె ప్రపుల్ల అన్నారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షతన ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు రంగురంగుల పూలతో బతకమ్మను పేర్చి, అంగరంగ వైభవంగా తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను జరుపుకుంటారని తెలిపారు. అనుబంధాలను కలుపుతూ సాంప్రదాయాలను పెంపొందించే పండుగ బతుకమ్మని, విద్యార్థులు సనాతన సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తూ, ప్రతి ఒక్కరు బతుకమ్మను సంతోషంగా జరుపుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దివ్య, ఆర్సిపి హరిసింగ్, లెక్చలేర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి 2 లక్షల రుణమాఫీ చేయిస్తాం

## - రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు





**రాయపర్తి, అక్టోబర్ 1,(జర్నలిస్ట్ వార్త):**


కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయిస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం రాయపర్తి మండల కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు 100 రోజుల్లో ఆరు గ్యారంటిలని అన్నారు. అధికారంలోకి వచ్చి, 6 పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని వారు ఆరోపించారు. రైతు రుణమాఫీ 2 లక్షలు పూర్తి కాలేదని విమర్శించారు. అధికారం కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు రైతుల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. దీనిపై ప్రతి ఒక్క రైతు స్పందించి, పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండల కేంద్రంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి స్వచ్ఛందంగా రావాలని పిలుపునిచ్చారు. (రైతుబంధు) రైతు భరోసా ఎకరాకు 15 వేల రూపాయలు, రైతు కూలీలకు 12 వేలు రాలేదన్నారు. రైతులు పండించిన పంటకు క్వింటాలుకు 5 వందల రూపాయల అదనపు బోనస్ రాలేదన్నారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం దాదాపుగా 420 వరకు అసాధ్యమైన హామీలు ఇచ్చి, నెరవేర్చడంలో విఫలమైందని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేని కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరసింహ నాయక్, జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, రాయపర్తి పిఎసిఎస్ చైర్మన్ కొండూరు రామచంద్ర రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షులు ఎండి నయీమ్, అధికార ప్రతినిధి తాళ్లపల్లి సంతోష్ గౌడ్, మాజీ ఎంపిటిసి అయిత రామచందర్, చెవ్వ కాశీనాథం, బందెల బాలరాజు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# మెడికల్ సీటు సాధించిన మెకానిక్ కూతురు

## - హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



రాయపర్తి, అక్టోబర్ 1,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ఐత సుష్మ మెడికల్ సీటు సాధించుకున్నారు. మంగళవారం ఈ సంఘటన రాయపర్తి మండల కేంద్రంలో చర్చనీయాంశమైంది. స్థానికుల కథనం ప్రకారం రాయపర్తి మండల కేంద్రం అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన ఐత సుధాకర్ ఓ మెకానిక్ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి ఆయన శ్రమ ఫలించిందని స్థానికులు మాట్లాడుతున్నారు. సుధాకర్ కష్టపడి తన కూతుర్ని ఉన్నతంగా చదివించారు. సిద్దిపేట జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజి కాళోజీ నారాయణరావు యూనివర్శిటీలో ఎంబిబిఎస్ సీటు సాధించారు. నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ, ఆర్థిక స్థితిగతులు చదువుకు అడ్డుకాదని, పట్టుదల ఉంటే సాధ్యం కాదని ఏదీ లేదంటూ మెడికల్ సీటు సాధించి సుష్మ నిదర్శనంగా నిలిచారు. పట్టుదలతో చదువుకుని మెడికల్ సీటు సాధించుకున్న సుష్మ తల్లిదండ్రులు ఐత సుధాకర్ కృష్ణవేణిల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కష్టపడి చదివి మెడికల్ సీట్ సాధించిన సుష్మని మండల ప్రజలు అభినందిస్తున్నారు.





తల్లిదండ్రులు ఐత సుధాకర్ కృష్ణవేణి


# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనం బతుకమ్మ వేడుకలు

## - ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి మధుకర్ రెడ్డి



రాయపర్తి, అక్టోబర్ 1,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండుగని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల మధుకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మహబూబ్ నగర్, మొరిపిరాల, సన్నూరు, పెరికేడు, వెంకటేశ్వరపల్లి గ్రామాలలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులకు ఇష్టమైన పండుగ అంటే బతుకమ్మ పండుగ అన్నారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్ రెడ్డి మహిళలకు పెద్దన్నలా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరపున వివిధ గ్రామాలకు చెందిన 1200 మంది మహిళలకు ఉచిత చీరలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సంధి దేవేందర్ రెడ్డి, సురేందర్, రాథోడ్, కోల సంపత్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్ తో బర్రె మృతి



**వర్ధన్నపేట, అక్టోబర్ 1,(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం రామోజీ కుమ్మరిగూడెం తండాకు చెందిన భూక్యా శంకర్ అనే రైతు వ్యవసాయ పొలం వద్ద తన బర్రెను మెతకు తీనుకువెళ్లారు. ప్రమాదవశాత్తూ ప్రక్కనే ఉన్న విద్యుత్ తీగ తగిలి బర్రె కరెంట్ షాక్ తో మృతి చెందినట్లు బాధితుడు శంకర్ తెలిపారు. దాదాపు మృతి చెందిన బర్రె 80 వేల విలువ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. బాదితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ పండుగ వేడుకలు

**వర్ధన్నపేట, అక్టోబర్ 1,(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ పరిధిలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ పండుగ వేడుకలు కన్నుల పండుగ నిర్వహించారు. ఆల్ ఫోర్స్ సంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి ఆదేశానుసారం ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి ఈ వేడుకలను ఘనంగా పురస్కరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక సాంప్రదాయాలను కళ్లకు కట్టినట్లుగా వేడుక నిర్వహణ కొనసాగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు, విద్యార్థినీలు రంగు రంగుల పూలను చేర్చి, బతుకమ్మను తయారుచేసి గ్రూపుల వారిగా బతుకమ్మ ఆటపాటలతో పాఠశాల ఆవరణమంతా అలరించారు. బతుకమ్మ వేడుకల అనంతరం విజయదశమి వేడుకలను విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా నిర్వహించారు. జమ్మి చెట్టు వద్ద పూజలు నిర్వహించి, ఏ విధంగానైతే గ్రామీణ ప్రాంతాల్లో పురాతన సంప్రదాయాలు కొనసాగిస్తుంటారో అదే రీతిలో జమ్మి చెట్టు ప్రత్యేకతను వివరించారు. అనంతరం రావణ వధ కార్యక్రమంలో భాగంగా రావణాసురుని విగ్రహాలు తయారు చేసి రావణ వేద వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇలా తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ప్రతి వేడుకను పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించుకోవడం ఆ పాఠశాలలో ఆనవాయితిగా జరుగుతుంది. చదువుతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలు, చారిత్రాత్మకమైన నాగరికతను వివరిస్తూ విద్యార్థులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడమే ఆ పాఠశాల యొక్క ప్రాధాన్యతని పాఠశాల యాజమాన్యం వివరించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని సంబరమాశ్చర్యానికి గురయ్యారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.















